
నమస్తే తెలంగాణ

# మెదక్

I హైదరాబాద్, శుక్రవారం 13 సెప్టెంబర్ 2024 MEDAK




సంగారెడ్డి జిల్లా కంది మండలంలోని రవాణా శాఖ కార్యాలయంలో మూలన పడిన వాహనాల్లో నిండిన చెత్త



దుబ్బాకలో మృతి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త కుటుంబానికి రూ.2 లక్షల సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

# డెంగీ వర్రీ..!



## పారిశుధ్య లోపంతో పంజావిసురుతున్న డెంగీ

- పట్టణాలు, పల్లెల్లో కానరాని పారిశుధ్యం
- సంగారెడ్డి జిల్లాలో గతనెల 171 డెంగీ కేసులు
- ఈనెల ఇప్పటి వరకు 38 కేసులు నమోదు
- డెంగీతో హత్నూరలో మృతిచెందిన చిన్నారి

సంగారెడ్డి, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ) : సంగారెడ్డి జిల్లాలో పారిశుధ్యం పడకేయడంతో విషజ్వరాలు పంజావిసురుతున్నాయి. విపరీతంగా దోమలు పెరిగి డెంగీ కేసులు భారీగా నమోదవుతున్నాయి. ప్రభుత్వం, అధికారులు ప్రజారోగ్యాన్ని పట్టించుకోవడం లేదు. గడిచిన మూడు నెలల్లో సంగారెడ్డి జిల్లాలో 279 డెంగీ కేసులు నమోదయ్యాయి. ప్రైవేట్ దవాఖానల్లోనూ వందల సంఖ్యలో డెంగీ కేసులు నమోదై రోగులు చికిత్స పొందుతున్నారు.ఇటీవల హత్నూర మండలం కొన్యాల గ్రామానికి చెందిన శిశువు దశ్విక్ డెంగీతో మృతిచెందాడు. జిల్లాలో డెంగీ బారిన పడుతున్నవారి సంఖ్య రోజురోజుకు పెరుగుతున్నది. సంగారెడ్డి, సదాశివపేట, అందోల్, పటాన్‌చెరు మున్సిపాలిటీల పరిధిలో, జహీరాబాద్, అందోలు, సంగారెడ్డి నియోజకవర్గాల్లోని గ్రామాల్లో డెంగీ కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. పల్లెలు, పట్టణాల్లో పారిశుధ్య నిర్వహణ పడకేసింది. వారంలో ఒకరోజు నిర్వహించే డ్రైడే మొక్కుబడిగా సాగుతోంది. దీంతో డెంగీ, టైఫాయిడ్, ఇతర విషజ్వరాలతో జనం సతమతమవుతున్నారు. డయేరియా కేసులు పెరుగుతున్నాయి.

### ఆందోళనకర స్థాయిలో కేసులు...

సంగారెడ్డి జిల్లాలో ఆందోళనకర స్థాయిలో డెంగీ కేసులు నమోదవుతున్నాయి. ప్రభుత్వ, ప్రైవేట్ దవాఖానలు రోగులతో కిటకిటలాడుతున్నాయి. ప్రభుత్వ దవాఖానల్లో సరైన చికిత్స లభించక చాలామంది ప్రైవేట్ దవాఖానల్లో చేరుతున్నారు. వైద్యానికి భారీగా ఖర్చు చేయాల్సి వస్తున్నది. సంగారెడ్డి జిల్లాలో ఈ సీజన్‌లో ఇప్పటి వరకు 279 డెంగీ కేసులు నమోదయ్యాయి. జూలైలో 70, ఆగస్టులో 171, ఈనెల ఇప్పటి వరకు 38 కేసులు నమోదయ్యాయి. డెంగీ నిర్ధారణ పరీక్షలకు రోగులు పెద్దసంఖ్యలో దవాఖానలను ఆశ్రయిస్తున్నారు. డెంగీ రోగుల కోసం సంగారెడ్డిలోని జనరల్ దవాఖానలో ప్రత్యేకంగా ఒక వార్డు ఏర్పాటు చేశారు. డెంగీతో పాటు జిల్లాలో టైఫాయిడ్ కేసులు ఎక్కువగానే నమోదవుతున్నాయి. జూలైలో 356, ఆగస్టులో 134, ఈనెల ఇప్పటి వరకు 25 టైఫాయిడ్ కేసులు రిపోర్టు అయ్యాయి. డయేరియా కేసులు జూలైలో 348, ఆగస్టులో 275, ఈనెలలో 92 కేసులు నమోదయ్యాయి. జిల్లా యంత్రాంగం ఇకనైనా మేల్కొని చర్యలు చేపట్టాలని ప్రజ లు కోరుతున్నారు.





సంగారెడ్డి పట్టణంలోని నల్సా గడ్డ బొబ్బిలి కుంట చెరువు మురుగుతో నిండిన వైనం



కంది అసైన్డ్ భూమిలో పేరుకుపోయిన చెత్తాచెదారం



ఝరాసంగం మండల కేంద్రంలోని కార్యాలయాలకు రోడ్డు పక్కన డంప్ చేసిన చెత్త, పందుల స్వైర విహారం

# హైడ్రా పేరిట.. కాంగ్రెస్ హైడ్రామా

- కాంగ్రెస్ అధిష్టానానికి డబ్బు సంచులు పంపేందుకు తెలంగాణలో హంగామా
- రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి
- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక, సెప్టెంబర్ 12: కాంగ్రెస్ ప్రభుత్వం తన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు హైడ్రా పేరిట హైడ్రామా కొనసాగిస్తుందని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి మండిపడ్డారు. రాష్ట్రంలో రైతులకు భరోసా లేకుండా పోయిందని, పేదలకు సంక్షేమ పథకాలు అందకుండా పోయాయని ధ్వజమెత్తారు. గురువారం దుబ్బాకలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ...ప్రజాపాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి డబ్బు సంచులు పంపించేందుకే తెలంగాణలో రేవంత్ సర్కారు హైడ్రాను ఏర్పాటు చేసిందని విమర్శించారు. ఆరు గ్యారెంటీలతో అధికారం చేపట్టిన కాంగ్రెస్ పేదలను పూర్తిగా విస్మరించిందన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం పడకేయడంతో ప్రజలు డెంగీ, మలేరియా, చికున్‌గున్యా, విషజ్వరాలతో తల్లడిల్లుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనారోగ్యంతో ప్రజలు దవాఖానలకు పోతే అక్కడ సరైన వైద్య సదుపాయాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీల ఎన్నికలు లేక, ప్రత్యేకాధికారులతో గ్రామాలు అస్తవ్యస్తంగా మారాయని విమర్శించారు.

### రైతు ఆత్మహత్యలకు కారణం కాంగ్రెస్సే..

రైతుల ఆత్మహత్యలకు కారణం కాంగ్రెస్ సర్కారేనని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి మండిపడ్డారు. ఇటీవల నియోజకవర్గంలో అక్బర్‌పేట-భూంపల్లి మండలం చిట్టాపూర్‌కు చెందిన రైతు సోలిపేట సురేందర్‌రెడ్డికి రుణమాఫీ కాకపోవడంతోనే ఆత్మహత్య చేసుకున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. తొగుట మండలంలో కాన్గల్‌లో మరో రైతు ఆత్మహత్యకు పాల్పడటం బాధాకరమన్నారు. రైతుల ఆత్మహత్యలకు కాంగ్రెస్ సర్కారు కారణమని మండిపడ్డారు. రైతు రుణమాఫీ కోసం నిత్యం రైతులు బ్యాంకుల వద్దకు, వ్యవసాయ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. కల్యాణలక్ష్మి చెక్కులు ఇప్పటివరకు మంజూరు చేయకపోవడం సిగ్గు చేటన్నారు. నియోజకవర్గంలో సుమారు 12వందల మంది లబ్ధిదారులకు అందాల్సిన కల్యాణలక్ష్మి చెక్కులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వెళ్లిన అరికపూడి గాంధీ బీఆర్ఎస్‌లోనే ఉన్నానంటూ మాట్లాడటం సిగ్గు చేటని ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి మండిపడ్డారు. పార్టీ మారిన ఎమ్మెల్యే అరికపూడి గాంధీని ప్రశ్నించిందుకు ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై కాంగ్రెస్ గూండాలు దాడి చేయడం హేయనీయమన్నారు. కౌశిక్‌రెడ్డి ఇంటిపై జరిగిన దాడులను తీవ్రంగా ఖండిస్తున్నట్లు ప్రకటించారు.

### కార్యకర్తల కుటుంబాలకు అండగా..

కార్యకర్తల కుటుంబాలకు బీఆర్ఎస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఇటీవల దుబ్బాక నియోజకవర్గానికి చెందిన ఇద్దరు బీఆర్ఎస్ కార్యకర్తలు మృతి చెందారు. వారి కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. గురువారం దుబ్బాకలో ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులతో పాటు మృతి చెందిన కార్యకర్తల కుటుంబాలకు చెక్కులు అందజేశారు. దుబ్బాక మండలం పెద్దగుండావెళ్లి గ్రామానికి చెందిన గుడూరి మల్లయ్య కుటుంబానికి, తొగుట మండలకేంద్రానికి చెందిన చింత నారాయణ కుటుంబీకులకు మంజూరైన రూ.2 లక్షల చెక్కులు ఎమ్మెల్యే అందజేశారు. అనంతరం 270 మంది బాధితులకు రూ.90 లక్షలు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. దుబ్బాకలో పలు వినాయక మండపాల వద్ద నిర్వహించిన ప్రత్యేక పూజల్లో, అన్నదాన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రొట్టే రాజమౌళి, కడతల రవీందర్‌రెడ్డి, కొత్త కిషన్‌రెడ్డి, కైలాశ్, భూంరెడ్డి, ఎల్లారెడ్డి, బాలకిషన్ గౌడ్, నారాగౌడ్, ఆస స్వామి, యాదగిరి, జీడిపల్లి రవి, రాంరెడ్డి, రామస్వామి గౌడ్, కృష్ణ, నరేశ్, తిరుపతిరెడ్డి, సంజీవ్‌రెడ్డి, సత్యానారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# విషజ్వరాలతో విలవిల

- మంచం పట్టిన సిద్దిపేట పల్లెలు
- సిద్దిపేట జిల్లాలో ఈ సీజన్‌లో 14,867 ఫీవర్ కేసులు
- జిల్లాలో 84 డెంగీ, 69 టైఫాయిడ్ కేసులు నమోదు
- తూతూమంత్రంగా జ్వరం సర్వే

సిద్దిపేట, సెప్టెంబర్ 12: సిద్దిపేట జిల్లాలో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలతో పాటు పారిశుధ్యం పడకేసి పల్లెలు, పట్టణాల్లో ప్రజలు విషజ్వరాలతో బాధపడుతున్నారు. ముందస్తుగా ఇంటింట జ్వరం సర్వే చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలను సైతం అధికారులు పెడచెవిన పెట్టారు. ఫలితంగా జిల్లా వ్యాప్తంగా అనేక గ్రామాల్లో సీజనల్ వ్యాధుల బారిన పడి జనం అల్లాడిపోతున్నారు. వైద్య ఆరోగ్యశాఖ చెబుతున్న లెక్కల ప్రకారం జిల్లాలోని ప్రభుత్వ దవాఖానల్లో ఇప్పటి వరకు ఈ సీజన్‌లో 14,867 ఫీవర్ కేసులు నమోదయ్యాయి. ప్రైవేట్ దవాఖానల్లోనూ చాలామంది చికిత్స పొందారు. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు జిల్లాలో 84 డెంగీ కేసులు నమోదు అయ్యాయి. 69 టైఫాయిడ్, 1 మలేరియా కేసు, 1856 డయేరియా కేసులు నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఇటీవల పలువురు డెంగీతో మరణించారు. కానీ, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారులు వాటిని డెంగీ మరణాలుగా నమోదు చేయలేదని బాధిత కుటుంబాలు తెలిపాయి. జిల్లాలోని పీహెచ్‌సీలు,సీహెచ్‌సీలు, జిల్లా దవాఖానలు, జనరల్ దవాఖానల్లో నిత్యం 5650 వరకు ఓపీ నమోదవుతున్నట్లు అధికారులు తెలిపారు. ప్రైవేట్ దవాఖానల్లో చేరిన వారి సంఖ్య లెక్క లేదు.

### పెరుగుతున్న కేసులు..

- సిద్దిపేట ప్రభుత్వ జనరల్ దవాఖాన గత రెండు నెలల్లో 394 విష జ్వరాల కేసులు, 47 డయేరియా కేసులు, 32 డెంగీ కేసులు నమోదైనట్లు దవాఖాన సూపరిండెంట్ తెలిపారు. రెండు నెలల్లో 41877 ఓపీ నమోదైంది. బుధవారం రాత్రి వరకు 1378 మంది ఓపీలో వైద్యం చేయించుకున్నారు.
- దుబ్బాక వంద పడకల దవాఖానలో గురువారం 330 ఓపీ రోగులు రాగా, వీరిలో 32 మంది అడ్మిట్ అయ్యా రు.ఇందులో 22 మందికి వైరల్ ఫీవర్,10 మంది డయేరియాతో దవాఖానలో చేరారు. దుబ్బాకలో గతనెలలో 10 డెంగీ కేసులు నమోదైనట్లు అధికారులు తెలిపారు.
- హుస్నాబాద్ సామాజిక ఆరోగ్య కేంద్రంలో గురువారం వరకు నమోదైన ఓపీ 275గా ఉంది. ఇందులో 173 మంది వైరల్ ఫీవర్ రాగా, 28మంది తీవ్ర జ్వరంలో దవాఖానలో అడ్మిట్ అయ్యారు.
- చేర్యాల సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోజువారిగా 200 వరకు ఓపీ నమోదవుతుండగా, గత నెలలో ఒక డెంగీ కేసు నమోదైంది.



సిద్దిపేట ప్రభుత్వ జనరల్ దవాఖానలోని జనరల్ వార్డులో చికిత్స పొందుతున్న రోగులు



సిద్దిపేట ప్రభుత్వ జనరల్ దవాఖానలోని ఓపీ విభాగం వద్ద బారులు తీరిన జనం

# మళ్లీ మూతపడిన ఏడుపాయల ఆలయం

పాపన్నపేట, సెప్టెంబర్ 12: మంజీరా నది మళ్లీ వరద పోటెత్తడంతో ఏడుపాయ వన దుర్గమ్మ ఆలయాన్ని గురువారం మూసి వేశారు. రాజగోపురంలో దుర్గమ్మ ఉత్సవ విగ్రహాన్ని ఉంచి పూజలు చేస్తున్నారు. మంజీరా నది వైపు వెళ్లవద్దని పోలీసులు సూచించారు.



ఆలయం ఎదుట పొంగిపొర్లుతున్న మంజీరా

## అక్రమ నిర్మాణాలు కూల్చివేత



సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ సర్వేనెంబర్ 993లో కూల్చివేసిన నిర్మాణాలు

అమీన్‌పూర్ సెప్టెంబర్ 12: సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ స్థలంలో గురువారం అధికారులు అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. సర్వే నంబర్ 993లో కొందరు వ్యక్తులు అక్రమంగా నిర్మాణాలు చేపట్టడంతో గురువారం తహసీల్దార్ రాధా ఆధ్వర్యంలో కూల్చివేతలు చేపట్టారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఎవరైనా ప్రభుత్వ స్థలాల్లో అక్రమంగా నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కూల్చివేతలతోపాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

## సింగూరుకు స్వల్ప వరద

పుల్కల్, సెప్టెంబర్ 12: సంగారెడ్డి జిల్లా పుల్కల్ పరిధిలోని బాగారెడ్డి సింగూరు ప్రాజెక్టుకు స్వల్ప వరద వస్తున్నది. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 29.917 టీఎంసీలకు గానూ, ప్రస్తుతం ప్రాజెక్టులో 29.797 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టులోకి ఇన్ ఫ్లో 6002 క్యూసెక్కులు రాగా, అవుట్ ఫ్లో 3,243 క్యూసెక్కులు వెళ్తుందని ప్రాజెక్టు ఏఈ మహిపాల్ రెడ్డి గురువారం వెల్లడించారు.



జలకళతో సింగూరు ప్రాజెక్టు

# నకిలీ రిపోర్టర్‌పై కేసు


- హైడ్రా పేరుతో రూ.5 లక్షల డిమాండ్
- అరెస్ట్, రిమాండ్‌కు తరలింపు

అమీన్‌పూర్ సెప్టెంబర్ 12: నకిలీ రిపోర్టర్‌గా అవతారమెత్తిన ఓ వ్యక్తి రూ.ఐదు లక్షలు డిమాండ్ చేసి పట్టుబడిన ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సదా నాగరాజు కథనం ప్రకారం.. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని బీరంగూడ జయలక్ష్మినగర్ కాలనీకి చెందిన జన్వాడే రవి సీబీఆర్ కాలనీలో ఇంటి నిర్మాణం చేస్తున్నాడు. ప్రస్తుతం రెండో అంతస్తు పనులు చేస్తుండగా రామచంద్రాపురం పరిధిలోని సాయినగర్‌కు చందిన దగుడు రాము (42) మన వార్త రిపోర్టర్‌గా జన్వాడే రవి బిల్డింగ్ వద్దకొచ్చి బిల్డింగ్ ప్రభుత్వ స్థలంలో నిర్మిస్తున్నావంటూ భయభ్రాంతులకు గురిచేశాడని చెప్పారు. నిర్మాణానికి జీ+2 వరకు మాత్రమే అనుమతులు ఉన్నాయని అక్రమంగా నిర్మాణం చేపడుతున్నావని బెదిరింపులకు పాల్పడ్డారన్నారు. ఎమ్మార్వో, ఆర్డీవోతో రోజూ మాట్లాడతానని, హైడ్రా కమిషనర్ రంగనాథ్ తనకు బాగా తెలుసునని మరింత భయానికి గురి చేశాడు. వెంటనే నిర్మాణం పనులు నిలిపి వేయాలని, లేనిచో తనకు రూ.5 లక్షలు ఇవ్వాలని బెదిరించాడని ఇన్‌స్పెక్టర్ చెప్పారు. అంతేకాకుండా పత్రికల్లో రాసి బిల్డింగ్‌ను కూల్చి వేయిస్తానని, డబ్బులు ఇవ్వకపోతే నీ అంతు చూస్తాననడంతో రవి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు కేసు నమోదు చేసుకుని, రామును అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్టు ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు.

# ప్లాన్ ప్రకారమే కౌశిక్‌రెడ్డిపై దాడి

**జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి**

చేర్యాల, సెప్టెంబర్ 12: హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై హైదరాబాద్‌లో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికపూడి గాంధీ కాంగ్రెస్ గూండాలతో కలిసి చేసిన దాడిని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. గురువారం ఆయన విలేకరులతో ఫోన్‌లో మాట్లాడుతూ బీఆర్ఎస్ బీఫాంపై గెలిచి పార్టీ మారిన ఎమ్మెల్యేలు వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే అరికపూడి గాంధీ రాష్ట్ర రాజధానిలో వాహనాలతో ర్యాలీగా వెళ్లి దాడులు చేయడం ఏమిటని, బహిరంగంగా కౌశిక్‌రెడ్డి ఇంటికి వెళ్తున్నానని చెప్పి మరి వెళ్లి దాడులకు పాల్పడిన అరికెపూడితోపాటు ఆయన కార్యకర్తలు, అనుచరులపై చర్య లు తీసుకోవాలని పల్లా డిమాండ్ చేశారు. పోలీసులు ఎమ్మెల్యే ర్యా లీని ముందుగా ఎందుకు నిలువరించకపోవడం, పాడి కౌశిక్‌రెడ్డిని మాత్రం హౌస్ అరెస్టు చేయడం వెనుక కుట్ర దాగి ఉన్నదన్నారు. ప్లాన్ ప్రకారమే కౌశిక్‌రెడ్డిపై దాడి చేశారని ఆరోపించారు. ఎమ్మెల్యే అరికెపూడి వెంటనే తన పదవికి రాజీనామా చేసి ఎన్నికల్లో పోటీ చేయాలని హితవు పలికారు.



# జ్వరాలతో గ్రామాలు

**గజ్వేల్ దవాఖానకు నిత్యం వందల సంఖ్యలో రోగులు**

గజ్వేల్, సెప్టెంబర్ 12: వర్షాకాలం ప్రారంభం నుంచి గ్రామాల్లో పారిశుధ్యం లోపించడంతో ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. మూడు నెలలుగా ప్రభుత్వ దవాఖానల్లో ఓపీ చూపించుకునే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నది. ప్రభు త్వం గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టి సారించకపోవడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లోని జిల్లా దవాఖానలో ఆగస్టులో 17,920 మంది ఓపీ చూపించుకున్నారు. అందులో జ్వరంతో 484 దవాఖానకు రాగా, 87మంది దవాఖానలో చేరి చికిత్స చేయించుకున్నారు. డెంగీతో మరో ఏడుగురు దవాఖానలో చేరారు. సెప్టెంబర్‌లో ఇప్పటివరకు 6,870 మంది జ్వరంతో బాధపడుతూ దవాఖానకు రాగా, వారిలో రెండు డెంగీ కేసులు నమోదయ్యాయి. రెండు రోజుల క్రితం మండలపరిధిలోని అహ్మదీపూర్‌కు చెందిన బోయిని అనిత డెంగీతో మృతి చెందింది. బయ్యారం, ఆర్అండ్ఆర్ కాలనీల్లోని మరో ఇద్దరు డెంగీతో చికిత్స పొందుతున్నారు.

# రేవంత్ ప్రోత్సాహంతోనే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై దాడులు

- ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి నివాసంపై కాంగ్రెస్ రౌడీమూకల దాడి అమానుషం
- హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్



హుస్నాబాద్, సెప్టెంబర్ 12: సీఎం రేవంత్‌రెడ్డి ప్రోత్సాహంతోనే రాష్ట్రంలోని ప్రతిపక్ష పార్టీల నాయకులు, వారి ఇండ్లపై కాంగ్రెస్ మూకలు దాడులకు పాల్పడుతున్నాయని హుస్నాబాద్ మాజీఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ ఆరోపించారు. ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపై కాంగ్రెస్ రౌడీమూకలు దాడి చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. గురువారం హుస్నాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిని హౌస్‌అరెస్టు చేసి కాంగ్రెస్‌లో చేరిన అరికెపూడి గాంధీతోపాటు కాంగ్రెస్ మూకలను బయట వదిలేసి దాడులు జరుగుతున్నా పోలీసులు ప్రేక్షక పాత్ర వహించడం సిగ్గుచేటన్నారు. కొంతమంది ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లో చేర్చుకున్న సీఎం రేవంత్ మిగతా ఎమ్మెల్యేలు చేరేందుకు సుముఖత వ్యక్తం చేయకపోవడంతో ఇటువంటి దాడులకు పాల్పడి భయభ్రాంతులకు గురిచేస్తున్నాడని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి వైఖరి వల్ల రాబోమే రోజుల్లో రాష్ట్రం రణరంగంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపై, తెలంగాణ భవన్‌పై దాడికి పాల్పడిన ఎమ్మెల్యే అరికెపూడి గాంధీతోపాటు అతడి అనుచరులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జున్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

# నాణ్యమైన బోధనకు కృషి చేయాలి

- ఆంగ్ల మాధ్యమంపై ప్రత్యేక దృష్టి సారించాలి
- సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి
- హత్నూర మండలం గుండ్లమాచునూర్ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటిన కలెక్టర్

హత్నూర, సెప్టెంబర్ 12 : ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన బోధనకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. గురువారం హత్నూర మండలం గుండ్లమాచునూర్ ఆదర్శ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని, ఉపాధ్యాయులు విద్యార్థులను క్రమశిక్షణతో తీర్చిదిద్దాలన్నారు. ముఖ్యంగా ఆంగ్ల మాధ్యమంలో విద్యార్థులు పట్టు సాధించేలా బోధన చేయాలన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి చదువులో రాణించేలా కృషి చేయాలని, విద్యార్థులకు అర్థమయ్యే తరహాలో బోధించి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో పాఠాలు చదివించారు. ఆంగ్లంలో పాఠాలు చదవడానికి విద్యార్థిని తడబడటంతో ఉపాధ్యాయుడిని పిలిచి ఆంగ్లంలో చదవడం, రాయడంపై పట్టు సాధించేలా కృషి చేయాలన్నారు. పాఠశాలలో సమస్యలు అడిగి తెలుసుకుని, పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు.

### కాలుష్యంతో బతకలేక పోతున్నాం

కెమికల్ పరిశ్రమలు విడుదల చేసే వాయు కాలుష్యంతో బతకలేకపోతున్నామని గుండ్లమాచునూర్ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. గుండ్లమాచునూర్ శివారులోని కంది మండలం ఆరట్ల శివారులో సంగారెడ్డి మున్సిపాలిటీ డంప్ యార్డు కోసం స్థల పరిశీలనకు వెళ్లిన కలెక్టర్‌కు గ్రామస్తులు తమ ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ శివారులో ఇప్పటికే నెలకొల్పిన కాలుష్య కారక పరిశ్రమలతో బతకలేకపోతున్నామని, అదిచాలదన్నట్లు సంగారెడ్డి మున్సిపాలిటీ డంప్ యార్డును గ్రామ సమీపంలో ఏర్పాటు చేస్తే ఊరువిడిచి వెళ్లాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే గ్రామంలో అనేకమంది ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ట్రైనీ కలెక్టర్ మనోజ్, మున్సిపాలిటీ కమిషనర్ ప్రసాద్ చౌహాన్, తహసీల్దార్లు ఫర్హీన్ షేక్, విజయలక్ష్మి, ఎంపీడీవో శంకర్, ఎంపీవో యూసూఫ్, ఆర్ఐ శ్రీనివాస్ తదతరులు పాల్గొన్నారు.



హత్నూర మండలం గుండ్లమాచునూర్ పాఠశాలలో విద్యార్థులతో పాఠాలు చదివిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

# రాష్ట్రాన్ని రౌడీ రాజ్యంగా మార్చిన సీఎం రేవంత్

- ఎమ్మెల్యే పాడి కౌషిక్‌రెడ్డిపై దాడి హేయనీయం
- నారాయణఖేడ్ మాజీఎమ్మెల్యే భూపాల్ రెడ్డి

నారాయణఖేడ్, సెప్టెంబర్ 12: పదేండ్ల కేసీఆర్ పాలనలో శాంతియుతంగా ఉన్న తెలంగాణ రాష్ట్రం రేవంత్‌రెడ్డి సీఎం అయిన తర్వాత రౌడీ రాజ్యంగా మారిందని నారాయణఖేడ్ మాజీఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి విమర్శించారు. గురువారం నారాయణఖేడ్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే పాడి కౌషిక్‌రెడ్డిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, రాష్ట్ర రాజధానిలో ఒక ఎమ్మెల్యే ఇంటిపై మరో ఎమ్మెల్యే, అతడి అనుచరులు మూకుమ్మడిగా దాడికి పాల్పడడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ కాంగ్రెస్‌లో చేరి ఇటీవల వచ్చిన హైకోర్టు ఆదేశాలకు భయపడి మాటమార్చిన విధానాన్ని ఎమ్మెల్యే పాడి కౌషిక్‌రెడ్డి ప్రశ్నిస్తే దాడికి పాల్పడడం ఎంత వరకు సమంజసమన్నారు. అధికార పార్టీకి తొత్తులుగా వ్యవహరిస్తున్న పోలీసులు పాడి కౌషిక్‌రెడ్డిని హౌస్ అరెస్టు చేసి, అరికెపూడి గాంధీని మాత్రం ఎస్కార్ట్‌తో కౌషిక్‌రెడ్డి ఇంటికి తీసుకువచ్చారన్నారు. పోలీసులు దగ్గరుండి మరీ దాడులు చేయిస్తున్నారంటే పోలీసు వ్యవస్థ ఎక్కడికి దిగజారిపోతుందని వాపోయారు. అరికెపూడి గాంధీ ఆంధ్రా ప్రాంతానికి చెందిన వారైనప్పటికీ, బీఆర్ఎస్ పార్టీ అక్కున చేర్చుకుని అవకాశమిస్తే కాంగ్రెస్‌లో చేరి డ్రామాలాడుతున్నాడని పేర్కొన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలు, తెలంగాణవాదులు తలచుకుంటే అరికెపూడి గాంధీకి తగిన గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. ఎమ్మెల్యే గాంధీకి ఏమైనా నైతిక విలువలు ఉంటే ముందు బీఆర్ఎస్ తరపున గెలిచిన తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే పాడి కౌషిక్‌రెడ్డిపై దాడికి పాల్పడిన ఎమ్మెల్యే అరికెపూడి గాంధీతోపాటు ఆయన అనుచరులపై పోలీసులు వెంటనే కేసు నమోదు చేయాలని లేనిపక్షంలో పోలీసుల వ్యవహార శైలిపై న్యాయపరంగా ముందుకుపోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు ఎం.ఏ.నజీబ్, ముజామ్మిల్, విఠల్‌రావు, పండరి తదితర నాయకులు పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న నారాయణఖేడ్ మాజీఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

